## ప్రజాజ్యోతి తెలుగు జాతీయ పత్రికకు విలేకరులు కావలెను

కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా వార్తల్లో నిర్భయంగా ముందుకు దూసుకుపోతున్న ప్రజాజ్యోతి దినపత్రికకు వివిధ మండలాలకు రిపోర్టర్లు కావలెను. బాన్సువాడ టౌన్, బిచ్కుంద. బీర్కూర్. తాడ్వాయి. లింగంపేట, నస్రుల్లాబాద్, ఎల్లారెడ్డి మండలాలకు రిపోర్టర్‌లు కావలెను.

ఈ క్రింది నెంబర్ ను సంప్రదించండి.

**96665 56646**



జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

## నిజామాబాద్ కామారెడ్డి

ఆదివారం, ఫిబ్రవరి 8, 2026 | పేజీలు: 7


### కాంగ్రెస్ పార్టీకి ఈ ఎన్నికల్లో

# బుద్ధి చెప్పాలి

## బిచ్కుందలో కేటీఆర్ ఎన్నికల ప్రచారం



**జుక్కల్ ఆర్సి ప్రజా జ్యోతి ఫిబ్రవరి 7**
బిచ్కుంద మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రజలను మోసం చేస్తోందని తీవ్ర విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని ఆయన అన్నారు. అభివృద్ధి పనులు నిలిచిపోయాయని, ప్రజల సమస్యలను పట్టించుకునే పరిస్థితి లేదని కేటీఆర్ పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ అబద్ధపు హామీలతో ప్రజలను

-మిగతా 2లో..

### మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ

# విజయభేరి మోగిస్తుంది

## నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి



**బాల్కొండ ఆర్ సి ప్రజా జ్యోతి ఫిబ్రవరి 7**
నిజామాబాద్ లోకసభ నియోజకవర్గ పరిధిలోనిపురపాలక సంఘం ఎన్నికల ప్రచారం లో పాల్గొన్న రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి
లోకసభ నియోజకవర్గ పరిధిలోని కోరుట్ల,భీంగల్ మెట్పల్లి విస్తృతంగా పర్యటిస్తున్న మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి భీంగల్ పురపాలక సంఘం ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి
భీమ్గల్ పురపాలక సంఘం ఎన్నికల ప్రచారంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి భీంగల్ పురపాలక సంఘం ఎన్నికల్లోనూ కాంగ్రెస్ పార్టీ క్లిన్ స్వీప్ చేస్తుంది కౌన్సిలర్ గా పోటీ చేస్తున్న ప్రతి అభ్యర్థిని చేతి గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని అన్నారుకాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన సన్నబియ్యం పంపిణీకి జనం నీరాజనాలు పడుతున్నారు
అర్హులైన వారందరికీ అందిస్తున్న తెల్ల రేషన్ కార్డుల మంజూరుతో ప్రజలందరూ కాంగ్రెస్ వైపు చూస్తున్నారు ఆర్.టి.సి లో ఉచిత బస్ ప్రయాణంతో మహిళలు కాంగ్రెస్ పార్టీకి బ్రహ్మరథం పడుతున్నారు 200 యూనిట్ల ఉచిత విద్యుత్

-మిగతా 2లో..

### కోర్టు డ్యూటీ సిబ్బందితో పోలీస్ కమిషనర్

# సమీక్ష సమావేశం



2లో

### మూడుముక్కలాటగా

# మున్సిపాలిటీ ఎన్నికలు

- రసవత్తరంగా జిల్లాలో ఎన్నికల జోరు
- గట్టి పోటీ తో హామీ లిస్టు ప్రచారం
- చైర్మన్ ఎవరిని వివరించునో?

2లో



# మూడుముక్కలాటగా మున్సిపాలిటీ ఎన్నికలు

**కామారెడ్డి (ఆర్ సి) ఫిబ్రవరి 7 (ప్రజాజ్యోతి)**
కామారెడ్డి మున్సిపాలిటీ ఎన్నికల్లో బి ఆర్ ఎస్, కాంగ్రెస్, బిజెపి పార్టీలు ఎవరికి వారే సరికొత్త హామీలను ఇస్తూ ప్రచారంలో దూసుకుపోతున్నారు. పార్టీల నాయకులు వచ్చి తమ అభ్యర్థులనే గెలిపించాలని, మద్దతు తెలుపుతూ ప్రచారాన్ని తారా స్థాయికి తీసుకెళ్తున్నారు. ఓటర్లను ఆకర్షిస్తూ, ప్రసన్నం చేసుకునే పనిలో కౌన్సిలర్ అభ్యర్థులు తల మునకలై ఉన్నారు. రానున్న మూడు రోజుల్లో ఎన్నికల ప్రచారం ముగియనుండడంతో ఇంకా జోరు పెంచి ఓటర్ల నాడి పట్టుకోవడంలో అభ్యర్థులు వారి వారి పంతాలో దూసుకుపోతున్నారు. గతంతో పోలిస్తే ఈసారి మున్సిపల్ ఎన్నికలు ఉత్సాహభరితంగా జరగనున్నాయి. ఇంత గట్టి పోటీలో చైర్మన్ పదవి ఏ పార్టీని వరిస్తుందో చూడాలి

## కోర్టు డ్యూటీ సిబ్బందితో పోలీస్ కమిషనర్
# సమీక్ష సమావేశం

**నిజామాబాద్ రూరల్: ఫిబ్రవరి, 7 (ప్రజా జ్యోతి)**
నిజామాబాద్ పోలీస్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ హాల్‌లో శనివారం జిల్లా పోలీస్ కమిషనర్ శ్రీ పి. సాయి చైతన్య, ఐ.పి.ఎస్., కోర్టు డ్యూటీ విధులు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు.
ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ, పోలీస్ శాఖలో ప్రతి సిబ్బంది పాత్ర అత్యంత కీలకమని, ముఖ్యంగా కోర్టు డ్యూటీ విభాగాల్లో పనిచేస్తున్న సిబ్బంది న్యాయ ప్రక్రియ వేగవంతం కావడంలో ముఖ్య భూమిక వహిస్తున్నారని పేర్కొన్నారు. విధుల్లో నిబద్ధత, క్రమశిక్షణ, సమయపాలన తప్పనిసరిగా పాటిస్తూ అప్పగించిన బాధ్యతలను బాధ్యతాయుతంగా నిర్వర్తించాలని సూచించారు.
ప్రజలకు న్యాయం, భద్రత కల్పించడమే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని తెలిపారు. కేసుల విచారణ త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవడంతో పాటు, సాక్షులను సమర్థవంతంగా కోర్టుకు హాజరు పరచి నేరస్తులకు శిక్ష పడేలా కృషి చేయాలని ఆదేశించారు. ఇందువల్ల పోలీస్ శాఖ ప్రతిష్ఠ మరింత పెరుగుతుందని పేర్కొన్నారు.
అనంతరం కోర్టు డ్యూటీ సిబ్బంది బాగోగులను అడిగి తెలుసుకుని, వారి సమస్యలను పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు.
ఈ సమావేశంలో సి.సి.ఆర్.బి., సి.ఐలు శ్రీ రమేష్, శ్రీ అంజయ్య, కోర్టు లైజనింగ్ ఆఫీసర్ శ్రీ శ్యామ్ కుమార్, సి.సి.ఆర్.బి. సిబ్బంది, కోర్టు పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ
# విజయభేరి మోగిస్తుంది

సరఫరాతో మధ్యతరగతి ప్రజలు కాంగ్రెస్ పార్టీకే బాసటగా నిలుచున్నారు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక జరుగుతున్న అభివృద్ధి, అమలవుతున్న సంక్షేమం పథకాలే పురపాలక సంఘం ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయభేరి మ్రోగిస్తుందిఢిల్లీ నుండి గల్లీ వరకు ముస్లిం మైనారిటీలకు కాంగ్రెస్ పార్టీ అండగా నిలబడిందిమైనారిటీలకు రక్షణ కవచంగా కాంగ్రెస్ పార్టీ లోకసభ నాయకుడు రాహుల్ గాంధీ నిలుచున్నారుకాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధిలో ప్రజలను భాగస్వామ్యం చేస్తాం ఈ కార్యక్రమంలో బాల్కొండ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి ముత్యాల సునీల్ కుమార్ ఈరావతి అనిల్ మానాల మోహన్ రెడ్డి అన్వేష్ రెడ్డి జిల్లా నాయకులు మండల నాయకులు తదితరులు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు

## ఆ వాహనంపై 2శాతం ట్యాక్స్ రద్దు

తెలంగాణ ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త అందించేందుకు సిద్ధమవుతోంది. రెండో వాహనం కొనుగోలు చేసే వారికి ఇప్పటివరకు చెల్లించాల్సి వస్తున్న 2 శాతం అదనపు లైఫ్‌ట్యాక్స్ నుంచి త్వరలోనే ఊరట కల్పించనుంది. ఈ మేరకు రవాణాశాఖ ప్రతిపాదనలు సిద్ధం చేయగా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దీనికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం. అధికారిక ఉత్తర్వులు త్వరలోనే జారీ అయ్యే అవకాశాలు ఉన్నాయని ప్రభుత్వ వర్గాలు వెల్లడిస్తున్నాయి. తెలంగాణలో ప్రతి ఏటా 7 లక్షల వరకు కొత్త బైకులు.. అలాగే కార్లు 2.57 లక్షల వరకు కొనుగోళ్లు ఉంటున్నాయి.
లైఫ్‌ట్యాక్స్ కింద రూ.2,400
వీటిలో రెండోసారి 1.91 లక్షల వరకు కొనుగోలు చేస్తున్నారు. ఇలా రెండో వాహనం కొనుగోలు చేసేవారు అదనంగా లైఫ్‌ట్యాక్స్ చెల్లిస్తున్నారు.రెండో వాహనం కొనుగోలు చేసేవారు 2శాతం లైఫ్ ట్యాక్స్ కడుతున్నారు. ఉదాహరణకు ఎవరైనా రూ.1.20 లక్షల విలువైన బైక్ కొనుగోలు (రెండో వాహనం) చేస్తే అదనంగా 2% లైఫ్‌ట్యాక్స్ కింద రూ.2,400



కడుతున్నారు. ఇలా చూస్తే తెలంగాణ రవాణాశాఖకు ప్రతి ఏటా రూ.80 కోట్ల నుంచి రూ.100 కోట్ల వరకు ఆదాయం వస్తోంది.



# కాంగ్రెస్ పార్టీకి ఈ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలి

మభ్యపెడుతోందని ఆరోపించారు.ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు బుద్ధి చెప్పాలని, అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా పనిచేసిన బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేసి ఘన విజయం అందించాలని ఆయన పిలుపునిచ్చారు. బిచ్కుంద మున్సిపాలిటీని అభివృద్ధి పథంలో నడిపించగలది బీఆర్ఎస్ పార్టీయేనని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు.
ఈ కార్యక్రమంలో జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హనుమంత్ షిండే హరీష్ షిండే నల్చర్ల రాజు గాంధారి మాజీ జడ్పీటిసి తానాజీ పటేల్ ఉమ్మడి నిజామాబాద్ మాజీ జెడ్పి చైర్మన్ రాజు బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.


## కిశోర బాలిక స్వీయ క్రమ శిక్షణ , పొదుపు, వ్యక్తిగత పరిశుభ్రత



**ధర్పల్లి :ఫిబ్రవరి /7 (ప్రజా జ్యోతి)**
ధర్పల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో ఈరోజు 8, 9,10 మరియు ఇంటర్ విద్యార్థినిలకు కిశోర బాలిక అనే కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రత, పొదుపు మరియు స్వీయ క్రమశిక్షణ వంటి విషయాలపై అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ధర్పల్లి గ్రామ సర్పంచ్ చెలిమెల శ్రీనివాస్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్ పర్సన్ డి. లక్ష్మి కమ్యూనిటీ కోఆర్డినేటర్ అనురాధ మరియు పాఠశాల ఉపాధ్యాయ బృందం పాల్గొనడం జరిగింది.

## గ్రూప్-1 అభ్యర్థులకు హైకోర్టులో ఊరట

తెలంగాణలో గ్రూప్--1 ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు హైకోర్టు నుంచి ఊరట లభించింది. గ్రూప్ -1 నియామకాలపై సింగిల్ జడ్జి తీర్పును సీజే ధర్మాసనం రద్దు చేసింది. గ్రూప్ -1 జనరల్ ర్యాంకింగ్ లిస్టును రద్దు చేస్తూ గతంలో సింగిల్ జడ్జి తీర్పు ఇచ్చారు. మెయిన్స్ జవాబు పత్రాలు మళ్లీ మూల్యాంకనం చేయాలని పేర్కొన్నారు. సింగిల్ జడ్జి ఆదేశాలపై టీజీపీఎస్సీ, ఎంపికైన అభ్యర్థులు అప్పీలు చేశారు.విచారణ చేపట్టిన సీజే ధర్మాసనం తీర్పును వెలువరించింది. దీంతో గ్రూప్ -- 1 ఉద్యోగాలకు ఎంపికైన 562 మంది అభ్యర్థులకు ఊరట లభించింది. 2024 లో నిర్వహించిన గ్రూప్ 1 పరీక్షల్లో మొత్తం 562 మంది అభ్యర్థులను టీజీపీఎస్సీ ఎంపిక చేసింది. ఎంపికైన అభ్యర్థులకు 2025 సెప్టెంబర్ 27న సీఎం రేవంత్ రెడ్డి నియామక పత్రాలు అందించారు.



## రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ వాలీబాల్ పోటీలకు పెట్ సంగం విద్యార్థుల ఎంపిక





**గాంధారి, ఫిబ్రవరి 7 (ప్రజాజ్యోతి)**

నిజామాబాద్ జిల్లాలో జరుగుతున్న రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ వాలీబాల్ పోటీలకు గాంధారి మండలం పెట్ సంగం పాఠశాల విద్యార్థులు ఎంపికై ప్రతిభ చాటారు. ఫిబ్రవరి 6, 7 మరియు 8 తేదీల్లో నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లి మండలంలోని మినీ స్టేడియంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి 8వ సబ్ జూనియర్ బాల బాలికల వాలీబాల్ పోటీల్లో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా తరఫున పాల్గొనే అవకాశం వీరికి లభించినట్లు పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుడు కుమారస్వామి తెలిపారు. పెట్ సంగం పాఠశాలకు చెందిన డి.దీపిక (9వ తరగతి), కె.సంధ్య (9వ తరగతి), ఎం.రామ్ చరణ్ (8వ తరగతి) విద్యార్థులు ఈ పోటీలకు ఎంపికయ్యారని పేర్కొన్నారు. జనవరి 25న నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని కలెక్టర్ క్రీడా మైదానంలో నిర్వహించిన జిల్లా స్థాయి ఎంపిక పోటీల్లో వీరు అద్భుత ప్రదర్శనతో రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారని వ్యాయామ ఉపాధ్యాయుడు లక్ష్మణ్ రాథోడ్ తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను పాఠశాల ఉపాధ్యాయ బృందం, పెట్ సంగం సర్పంచ్ పూర్వంతి నిర్మల, గుడివెనక తండ సర్పంచ్ రవీ నాయక్, మాతు సంగం సర్పంచ్ వందన బల్వంత్ రావు, కాయితీ తండ సర్పంచ్ నాజీ, గ్రామ యువకులు అభినందించారు. ఈ సందర్భంగా క్రీడాకారులు మరింత ఉన్నత స్థాయి పోటీల్లో విజయాలు సాధించాలని వారు ఆకాంక్షించారు.

# సోమ్లి సత్తి -- సవా సత్తి మందిరంలో భక్తుల సౌకర్యాల కోసం నిర్మాణ పనులు ప్రారంభం




**గాంధారి, ఫిబ్రవరి 7 (ప్రజాజ్యోతి)**

లింగంపేట్ మండల కేంద్రంలోని నాగన్న బావి సమీపంలో ఉన్న సోమ్లి సత్తి -- సవా సత్తి మందిరంలో భక్తుల సౌకర్యాల కల్పన లక్ష్యంగా లబనా యువకులు ముందుకు వచ్చి విరాళాలు సమకూర్చుతూ శనివారం రోజు నిర్మాణ పనులను ప్రారంభించారు. మందిరానికి వచ్చే భక్తులకు మరింత మెరుగైన సౌకర్యాలు అందించాలనే సంకల్పంతో ఈ నిర్మాణ కార్యక్రమాన్ని చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా లబనా సమాజానికి చెందిన యువకులు, పెద్దలు, భక్తులు ఉదారంగా విరాళాలు అందజేసి మౌళి ఆశీస్సులు పొందాలని లబనా యువకులు పిలుపునిచ్చారు. మందిర అభివృద్ధి పనులు ఇంకా కొనసాగుతున్నందున, సమాజానికి చెందిన నాయకులు, దాతలు ముందుకు వచ్చి మరింత ఆర్థిక సహకారం అందించి నిర్మాణాన్ని వేగవంతం చేయాలని కోరారు. సోమ్లి సత్తి -- సవా సత్తి మందిర అభివృద్ధికి ప్రతి ఒక్కరి భాగస్వామ్యం అవసరమని, విరాళాలు అందజేసే దాతల పేర్లను గౌరవంగా ప్రస్తావిస్తూ నిర్మాణాన్ని పూర్తి చేస్తామని నిర్వాహకులు తెలిపారు. భక్తుల సహకారంతో చేపట్టిన ఈ కార్యక్రమం ఆదర్శంగా నిలుస్తుండగా, త్వరితగతిన పనులు పూర్తి చేసి భక్తులకు మరిన్ని సౌకర్యాలు అందుబాటులోకి తీసుకురావాలని వారు ఆకాంక్షించారు.

# భూములను ఇస్తే రోగాలనిచ్చిన : ఎంఎస్ఎన్

- ఇంకా ఎన్నాళ్లు పరిశ్రమ నడిపిస్తారు
- పర్యావరణం దెబ్బ తింటున్న పట్టదా?
- అధికారుల నిశ్శబ్దానికి కారణమేంటి?
- ప్రాణాలు పోతున్న స్పందించని ప్రజాప్రతినిధులు
- ముడుపులతో నడుస్తున్న పరిశ్రమ

-అధికారుల తీరును తీవ్రంగా ఖండిస్తున్న గొల్ల మహేందర్ యాదవ్




**కామారెడ్డి (ఆర్ సి) భిక్కనూరు, ఫిబ్రవరి 7 (ప్రజా జ్యోతి)**

భిక్కనూరు పట్టణ శివార్లలో గత 15 సంవత్సరాల క్రితం ఏర్పాటు చేసిన ఎంఎస్ఎన్ పరిశ్రమ ద్వారా పర్యావరణ కాలుష్యం తో, పరిసర గ్రామాల్లో ప్రజలు చనిపోతున్న,అధికార యంత్రాంగం ఎందుకు నోరు మెదపట్లేదని కంచర్ల గ్రామానికి చెందిన గొల్ల మహేందర్ యాదవ్ ప్రశ్నిస్తున్నాడు. గత నెల రోజుల నుండి ఎంఎస్ఎన్ పరిశ్రమ అనుమతులను రద్దు చేసి, లాకౌట్ చేయాలని ముక్తకంఠంతో మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు ఏకతాటి పైకి వచ్చి భావితరాల భవిష్యత్తే మాకు ముఖ్యం, పరిశ్రమలు మాకు వద్దు అని ఖరాఖండిగా చెప్పినప్పటికీ, పర్యావరణ అధికారులు ఏం చేస్తున్నట్టు? అధికార యంత్రాంగం ఎందుకు స్పందించట్లేదు? ప్రజల ప్రాణాలు పణంగా పెట్టి ముడుపులతో పరిశ్రమలు నడుపుతున్నారా? అని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.

## అప్పుల బాధతో యువకుడి ఆత్మహత్య



**బీబీపేట్ మండల్ ప్రజా జ్యోతి ఫిబ్రవరి 7**

బీబీపేట మండలం లోని సీతారాం పల్లి గ్రామానికి చెందిన ఎర్ర గోపాల్ అనే వ్యక్తి అప్పుల భారం ఎక్కువ కావడంతో మనస్థాపానికి గురై బుధవారం రోజున గడ్డి మందు త్రాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అతడిని వెంటనే ఎల్లారెడ్డిపేట అశ్విని హాస్పిటల్ కు తరలించగా చికిత్స పొందుతూ శనివారం రోజున మరణించాడు. అతడి భార్య ఎర్ర సుగుణ ఫిర్యాదు మేరకు బీబీపేట ఎస్ ఐ కొండా విజయ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తామన్నారు

## ప్రశాంతంగా ముగిసిన శ్రీ ఖండేరాయ మహాదేవుని ఉత్సవాలు




**సదాశివనగర్ ఫిబ్రవరి 7 (ప్రజాజ్యోతి)**

సదాశివనగర్ మండలంలోని ఉత్తునూరు గ్రామంలో శ్రీ ఖశేదేరాయ మహాదేవుని 23వ వార్షికోత్సవ ఉత్సవాలు ఘనంగా ముగిసాయి. తెల్లవారుజామున అగ్నిగుండాలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి అభిషేకం చేశారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహి శీచారు. సాయంత్రం రథోత్సవ కార్యక్రమం ఊరేగింపుగా నిర్వహి ంచారు. ఈ కార్యక్రమంలో వీడిసి సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## గాంధారి మీదుగా వెళ్లిన కేటీఆర్‌కు ఘన స్వాగతం

**గాంధారి, ఫిబ్రవరి 7 (ప్రజాజ్యోతి)**

మునిసిపాలిటీ ఎన్నికల ప్రచార కార్యక్రమాల్లో పాల్గొనేందుకు కామారెడ్డి జిల్లా పరిధిలోని బాన్సువాడ, బిచ్కుంద, ఎల్లారెడ్డి మున్సిపాలిటీలకు శనివారం రోజు బయలుదేరిన టీఆర్ఎస్ (బీఆర్ఎస్) వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల తారక రామారావు గాంధారి మండల కేంద్రం మీదుగా ప్రయాణించగా, స్థానిక నాయకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గాంధారి మండలంలో మాజీ ఎమ్మెల్యే జాజల సురేందర్ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు కేటీఆర్‌కు పుష్పగుచ్ఛాలతో స్వాగతం చెప్పారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గాంధారి మీదుగా వెళ్తున్న కేటీఆర్‌కు మద్దతుగా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గాంధారి మండల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు విశాలంగా పాల్గొని పార్టీ విజయానికి కృషి చేస్తామని ఈ సందర్భంగా పేర్కొన్నారు.



# ఇస్రోజీవాడిలో మహిళా సంఘ భవనానికి స్థల పరిశీలన -సర్పంచ్ మల్లేష్





**కామారెడ్డి రూరల్ ఫిబ్రవరి 7 ప్రజా జ్యోతి**

ఇస్రోజీవాడి గ్రామంలో మహిళా సంఘ భవన నిర్మాణానికి సంబంధించి శనివారం విస్తృత స్థల పరిశీలన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ చిందం మల్లేష్ నాయకత్వం వహించగా, ఉప సర్పంచ్ సిద్ధం స్వామి, గ్రామపంచాయతీ కార్యదర్శి దుబ్బాక కల్పన, డి.ఈ స్వామి దాస్, ఏఈ నరేష్, వార్డు మెంబర్ చెట్కూరి ప్రణీత్ మరియు పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు మాజీ సర్పంచ్ కొత్త మమత రాజు, బాలమల్లు గ్రామ ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.మహిళా సంఘానికి కేటాయించనున్న భవనం నిర్మాణానికి అనువైన స్థలాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి పరిశీలించారు. మహిళల అవసరాలు, భవిష్యత్‌లో ఉపయోగపడే సదుపాయాలను దృష్టిలో ఉంచుకొని భవనం నిర్మాణం జరగాలని ఈ సందర్భంగా చర్చించారు. గ్రామ మహిళలకు సమావేశాలు, శిక్షణ కార్యక్రమాలు, స్వయం ఉపాధి కార్యక్రమాల నిర్వహణకు ఈ భవనం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అధికారులు అభిప్రాయపడ్డారు.

ఈ సందర్భంగా డి.ఈ స్వామి దాస్ మాట్లాడుతూ గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ భవనానికి సంబంధించిన పెండింగ్ పనులను ఎట్టి పరిస్థితుల్లోనూ ఆలస్యం చేయకుండా త్వరగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ నిధులతో చేపడుతున్న అభివృద్ధి పనులు నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా పూర్తికావాలని, ప్రజలకు పూర్తి స్థాయిలో ఉపయోగపడేలా ఉండాలని ఆయన స్పష్టం చేశారు.

గ్రామ సర్పంచ్ చిందం మల్లేష్ మాట్లాడుతూ మహిళా సంఘ భవనం నిర్మాణం ద్వారా గ్రామ మహిళలకు స్వావలంబన దిశగా ముందడుగు పడుతుందని తెలిపారు. మహిళల అభివృద్ధి కోసం ప్రభుత్వం చేపడుతున్న పథకాలు గ్రామస్థాయిలో సమర్థవంతంగా అమలయ్యేలా కృషి చేస్తామని చెప్పారు. గ్రామ అభివృద్ధి పనుల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయడం వల్లే గ్రామం అన్ని రంగాల్లో ముందుకు సాగుతుందని ఆయన పేర్కొన్నారు.

ఉప సర్పంచ్ సిద్ధం స్వామి మాట్లాడుతూ గ్రామంలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని, మహిళా సంఘ భవనం గ్రామానికి గర్వకారణంగా నిలుస్తుందని తెలిపారు. గ్రామపంచాయతీ కార్యదర్శి దుబ్బాక కల్పన అభివృద్ధి పనుల పురోగతిపై వివరాలు అధికారులకు తెలియజేశారు.

ఈ కార్యక్రమం ద్వారా గ్రామంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులపై అధికారుల ప్రత్యక్ష పర్యవేక్షణ ఉందని స్పష్టమవుతుందని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. మహిళా సంఘ భవన నిర్మాణం త్వరలో ప్రారంభమవుతుందనే ఆశాభావాన్ని వారు వ్యక్తం చేశారు.

# నర్సింగ్ రావుపల్లిలో ఎంపీడీవో శివకృష్ణ విస్తృత పర్యటన



**నిజాంసాగర్ ప్రజా జ్యోతి ఫిబ్రవరి 7**

నిజాంసాగర్ మండలంలోని నర్సింగ్ రావుపల్లిలో శని వారం ఎంపీడీవో శివకృష్ణ విస్తృతంగా పర్యటించారు. గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించిన ఆయన, అక్కడ పిల్లలకు అందుతున్న సేవలపై సిబ్బందిని అడిగి తెలుసు కున్నారు. ముఖ్యంగా చిన్నా రులకు అందిస్తున్న పోషకాహారం నాణ్యతను స్వయంగా పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆహారం నాణ్యతలో ఎలాంటి రాజీ పడకూడదని, పిల్లల ఆరోగ్యం అత్యంత ముఖ్యమని సూచించారు. అంగన్వాడీ కేంద్రంలో రికార్డులు, హాజరు పట్టికలు, శుభ్రత అంశాలపై కూడా దృష్టి సారించి పలు సూచనలు చేశారు.అనంతరం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలను ఎంపీడీవో సందర్శించారు. తరగతి గదుల పరిస్థితి, విద్యార్థులకు




అందుతున్న సౌకర్యాలు, వంటగది, వంట సామాగ్రిని పరిశీలించారు. మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును అడిగి తెలుసుకుని, విద్యార్థులకు పరిశుభ్రతతో కూడిన నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. పాఠశాల అభివృద్ధికి అవసరమైన అంశాలపై సిబ్బందితో చర్చించారు.ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి జ్యోతి, మాజీ సర్పంచ్ సాయిలుతో పాటు విద్యార్థులతో కలిసి ఎంపీడీవో శివకృష్ణ మధ్యాహ్న భోజనం స్వీకరించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని ఆయన తెలిపారు. గ్రామ అభివృద్ధికి అవసరమైన పనులను గుర్తించి త్వరితగతిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

## చిత్తు-బొత్తు ఆడుతున్న ఆరుగురు అరెస్టు

**నాగిరెడ్డిపేట్,ఫిబ్రవరి7(ప్రజాజ్యోతి):**

చిత్తు-బొత్తు ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను నాగిరెడ్డిపేట పోలీసులు ఆరెస్టు చేసిన సంఘటన శనివారం రాత్రి చోటుచేసుకుంది.ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని బొల్లారం గ్రామ శివారులో ఆరుగురు వ్యక్తులు కలిసి చిత్తుబొత్తు అనే జూదమును ఆడుతున్నారన్న పక్కా సమాచారం మేరకు స్థావరాలపై ఎస్సై భార్గవ్ గౌడ్,సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు.ఈ దాడుల్లో చిత్తు-బొత్తు ఆడుతున్న ఆరుగురిని అదుపులో తీసుకొని వారి వద్ద నుంచి 14,250 రూపాయల నగదు తో పాటు,7 మొబైల్ ఫోన్ లతో పాటు,ఆరు ద్విచక్రవాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. ఈ ఆరుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. మండలంలో పేకాట,చిత్తు--బొత్తు వంటి ఇతరాత్ర ఆసాంఘీక కార్యకాలపాలకు పాల్పడితే తమకు సమాచారం ఇవ్వాలని,సమాచారం ఇచ్చిన వారి వివరాలను గొప్యంగా ఉంచుతామని ఎస్సై సూచించారు.



## త్రాగునీటి సమస్య రాకుండా ముందస్తు చర్యలు



**సదాశివనగర్ ఫిబ్రవరి 7 (ప్రజాజ్యోతి)**

సదాశివనగర్ మండలం తుక్కోజీవాడి గ్రామంలో రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకొని త్రాగునీటి సమస్య తలెత్తకుండా గ్రామ పాలకవర్గం ముందస్తు చర్యలు చేపట్టింది. గ్రామ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సురక్షిత త్రాగునీరు అందించడమే లక్ష్యంగా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో చర్యలు తీసుకుంటున్నారు.గ్రామంలోని బోర్లు, మోటార్లు, వాటర్ ట్యాంకుల పనితీరును పరిశీలించి అవసరమైన మరమ్మతులు చేపడుతున్నారు. అలాగే త్రాగునీటి సరఫరాలో అంతరాయం ఏర్పడకుండా పైప్‌లైన్‌లను తనిఖీ చేసి లీకేజీలు ఉన్న చోట్ల వెంటనే మరమ్మతులు చేస్తున్నారు. అవసరమైతే అదనపు నీటి ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయడానికి కూడా ప్రణాళిక రూపొందించారు. వేసవిలో నీటి కొరత సమస్య రాకుండా ప్రతి ఒక్కరూ నీటిని వృథా చేయకుండా వినియోగించుకోవాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దొడ్లే సంగారావు, ఎంపీడీవో సంతోష్ కుమార్, ఎఇ శ్రీధర్ రెడ్డి, నాగేశ్వరరావు, ఉప సర్పంచ్ రాజయ్య, పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు తదితరులు ఉన్నారు

## తోటి మిత్రుల ఆర్థిక సహాయం



**బీబీపేట్ మండల్ ప్రజా జ్యోతి ఫిబ్రవరి 7**

బీబీపేట మండల కేంద్రంలో గల ఇస్సానగర్ గ్రామంలో పదవ తరగతి బ్యాచ్ 2007.2008 మిత్రులు తమ తోటి మిత్రుడైన ధర్మ గారి రాజా గౌడ్ ఇటీవల అప్పుల బాధ తట్టుకోలేక ఆత్మహత్య చేసుకొని మరణించడంతో వారి కుటుంబ సభ్యులకు 27500 రూపాయలు ఆర్థిక సహాయం చేయడం జరిగింది. వారి పిల్లలకు ఎంతో కొంత సహాయం అందుతుందన్న ఆలోచనతో ఇట్టి నిర్ణయం తీసుకున్నట్లు వారు తెలిపారు.

## ఓటు అనేది కేవలం గుర్తు కాదు... ప్రజలు తమ రేపటిని అప్పగించే నమ్మకం.



**కామారెడ్డి ప్రతినిధి ఫిబ్రవరి 7. (ప్రజాజ్యోతి)**

12వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి చిన్నోల్ల సుధారాణి రాజికాంత్ రావు మాట్లాడుతూవార్డు అభివృద్దే ద్యేయం.. ప్రజా క్షేమమే లక్ష్యం. అంటూ 2వ వార్డులో ప్రధాన సమస్యలు రోడ్లు ఒ డ్రైనేజీ, నేను గెలుపొందిన వెంటనే ఈ సమస్యలకు పరిష్కారం చూపుతాను. ఎండాకాలంలో నీటి సమస్యలు లేకుండా పరిష్కరిస్తాను. వార్డులో ఏ సమస్య వచ్చినా నా సమస్యగా భావించి సత్వరంగా పరిష్కరిస్తాను. వార్డు పరిశుభ్రతకై ప్రతిరోజు చెత్తబండిని మరియు మున్సిపల్ సిబ్బందిని అందుబాటులో ఉంచుతాను. వార్డు సస్యశామలంగా ఉండటానికి చెట్లను నాటించడం వంటి కార్యక్రమాలు చేపడుతాను. ముఖ్యంగా మహిళలకై మహిళా శక్తి కమిటిని ఏర్పాటు చేసి వారి సమస్యలను పరిష్కరిస్తాను వారి అభివృద్ధికై ఎల్లవేళల తోడ్పడుతాను.ఈ సారి మమ్మల్ని ఆశీర్వదించి రానున్న ఐదు సంవత్సరాల పాటు మీ అందరికీ సేవను... అభివృద్ధిని అందించే అవకాశం ఇవ్వాలని సవినయంగా విజ్ఞప్తి చేస్తున్నాను.

# ధర్మరావుపేటలో గేదెలకు ఉచిత గర్భకోశ వ్యాధుల వైద్య శిబిరం

## రైతులకు మేలు చేసే కార్యక్రమమని ప్రశంసించిన సర్పంచ్ హుమార్

**కామారెడ్డి రూరల్ ఫిబ్రవరి 7 ప్రజా జ్యోతి**

ధర్మరావుపేట గ్రామంలో పశుపాలక రైతుల సంక్షేమాన్ని లక్ష్యంగా చేసుకుని గేదెలకు ఉచిత గర్భకోశ వ్యాధుల నిర్ధారణ మరియు చికిత్స శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని గ్రామ సర్పంచ్ హుమార్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.ఈ సందర్భంగా సర్పంచ్ హుమార్ మాట్లాడుతూ, గ్రామంలో పశుపాలనపై ఆధారపడి జీవిస్తున్న రైతులకు ఇలాంటి వైద్య శిబిరాలు ఎంతో అవసరమని అన్నారు. గేదెలలో గర్భకోశ సంబంధిత వ్యాధులు ఉన్నట్లయితే పాల ఉత్పత్తి తగ్గడమే కాకుండా రైతులకు తీవ్ర ఆర్థిక నష్టం వాటిల్లుతుందని తెలిపారు. అలాంటి సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించి ఉచితంగా చికిత్స అందించడం అభినందనీయమని అన్నారు.

ఈ శిబిరంలో అనుభవజ్ఞులైన పశువైద్యులు గేదెలకు వైద్య పరీక్షలు నిర్వహించి, గర్భకోశ వ్యాధులపై అవగాహన కల్పించారు. అవసరమైన గేదెలకు మందులు, ఇంజెక్షన్లు ఉచితంగా అందజేశారు. రైతులకు గేదెల ఆరోగ్యం, పోషణ, సంరక్షణపై పలు సూచనలు చేశారు.పలువురు రైతులు తమ గేదెలను శిబిరానికి తీసుకొచ్చి వైద్య సేవలు పొందారు. ఉచితంగా నాణ్యమైన చికిత్స అందించడంతో రైతులు సంతృప్తి వ్యక్తం చేశారు. ఇలాంటి



శిబిరాలు తరచుగా నిర్వహించాలని వారు కోరారు.గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో భవిష్యత్తులో కూడా రైతులకు ఉపయోగపడే పశుసంరక్షణ కార్యక్రమాలు చేపడతామని సర్పంచ్ హుమార్ హామీ ఇచ్చారు. రైతుల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తామని ఆయన తెలిపారు.

ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, పశుపాలక రైతులు, పశువైద్య సిబ్బంది, గ్రామ యువకులు పాల్గొని శిబిరాన్ని విజయవంతం చేశారు.

# వేసవిలో నీటి ఎద్దడి నివారణకు ముందస్తు చర్యలు



## -ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్

**నాగిరెడ్డిపేట్,ఫిబ్రవరి7(ప్రజాజ్యోతి).**

రానున్న వేసవికాలంలో నీటి ఎద్దడి ఏర్పడకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ తెలిపారు.శనివారం తాండూర్ గ్రామంలో మిషన్ భగీరథ అధికారులతో కలిసి పర్యటించి,గ్రామంలో నెలకొన్న నీటి సమస్యలపై ఆరా తీశారు. ఈ సందర్బంగా గ్రామంలోని ఇందిరా నగర్ కాలనిలో నీటి ఎద్దడితో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వీటి నివారణకు చర్యలు తీసుకోవాలని స్థానిక సర్పంచ్ యాదాగౌడ్ అధికారులను కోరారు.ఈ కాలనీలో కొత్తగా బోరుబావిని తవ్వించాలని,సింగిల్ ఫీజ్ మోటార్ బిగించాలని కాలనీ వాసులు



కోరారు.గ్రామంలో ఒక్క వాటర్ ట్యాంక్,బోరుబావి ద్వారానే గ్రామ ప్రజలు తాగునీరు అందిస్తున్నామని, గ్రామానికి అదనంగా ఇంకో బోరుబావి ఉన్నప్పటికీ దానికి అవసరమైన పైప్ లైన్ లేకపోవడం వల్ల నీటిని సరఫరా చేయడం లేదని,కొత్తగా పైప్ లైన్ మంజూరు చేయాలని గ్రామా సర్పంచ్ ఎంపీడీఓ ను కోరారు.ఈ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని తెలిపారు. అనంతరం గ్రామంలోని ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను పరిశీలించి లబ్ధిదారులకు పలు సలహాలు సూచనలు చేసారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ భూమా యాదాగౌడ్,మిషన్ భగీరథ ఏఈ రాజ్ కుమార్ ఉపసర్పంచ్ సన్నీ,పంచాయతి కార్యదర్శి తిరుపతి,తదితరులు ఉన్నారు.

# మన ఇసుక వాహనంపై అవగాహన కల్పించిన ఎమ్మార్వో

**మెండోరా: ఫిబ్రవరి /07 (ప్రజా జ్యోతి)**

మెండోరా మండల కేంద్రంలోని రైతు భవన్‌లో ఎమ్మార్వో శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో "మన ఇసుక వాహనం" పై అవగాహన సదస్సు నిర్వహించబడింది.ఈ సందర్భంగా ఎమ్మార్వో శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రవేశపెట్టిన "మన ఇసుక వాహనం" విధానాన్ని సక్రమంగా వినియోగించుకోవాలని సూచించారు. ఇసుక రవాణా సమయంలో తప్పనిసరిగా అనుమతి పత్రాలు కలిగి ఉండాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే హైదరాబాద్ నుండి వచ్చిన ఇసుక వాహన యాప్ టెక్నీషియన్ నరేష్ మాట్లాడుతూ స్మార్ట్ ఫోన్లు లేనివారు సెక్రటరీ ద్వారా బుక్ చేసుకోవచ్చని తెలిపారు. అక్రమ ఇసుక రవాణాను అరికట్టడానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల గురించి వివరించారు.

అలాగే, వాహన యజమానులు మరియు డ్రైవర్లు ప్రభుత్వ మార్గదర్శకాలను పాటిస్తూ పారదర్శకంగా ఇసుక రవాణా నిర్వహించాలని తెలిపారు. ఈ అవగాహన కార్యక్రమం ద్వారా ఇసుక రవాణాలో పారదర్శకత పెరుగుతుందని మరియు అక్రమ రవాణా తగ్గుతుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో ఎంపీడీవో లక్ష్మణ్, ఎస్సై సుహాసిని, సంబంధిత శాఖల అధికారులు, గ్రామ పాలనాధికారులు మరియు పలువురు వాహన యజమానులు పాల్గొన్నారు.



# కామారెడ్డి 38వ వార్డు కౌన్సిలర్ కామారెడ్డి స్వతంత్ర అభ్యర్థి

## - ఇప్ప ఉమారాణి శ్రీనివాస్

**కామారెడ్డి ప్రతినిధి ఫిబ్రవరి 7. (ప్రజాజ్యోతి)**



38వ వార్డు కౌన్సిలర్ స్వతంత్ర అభ్యర్థి ఇప్ప ఉమారాణి శ్రీనివాస్ వార్డులో ప్రచారంలో భాగంగా మాట్లాడుతూ ప్రధాన సమస్యలు రోడ్లు ‌ఽ డ్రైనేజీ, నేను గెలుపొందిన వెంటనే ఈ సమస్యలకు పరిష్కారం చూపుతాను. ఎండాకాలంలో నీటి సమస్యలు లేకుండా పరిష్కరిస్తాను. వార్డులో ఏ సమస్య వచ్చినా నా సమస్యగా భావించి సత్వరంగా పరిష్కరిస్తాను. వార్డు పరిశుభ్రతకై ప్రతిరోజు చెత్తబండిని మరియు మున్సిపల్ సిబ్బందిని అందుబాటులో ఉంచుతాను. వార్డు సస్యశామలంగా ఉండటానికి చెట్లను నాటించడం వంటి కార్యక్రమాలు చేపడుతాను. ముఖ్యంగా మహిళలకై మహిళా శక్తి కమిటిని ఏర్పాటు చేసి వారి సమస్యలను పరిష్కరిస్తాను వారి అభివృద్ధికై ఎల్లవేళల తోడ్పడుతాను.గత ఎన్నికల్లో కేవలం ఏడు ఓట్లతో ఓడిపోయి మన వార్డుకు సేవ చేసే అవకాశం దొరకలేదు, మరోసారి మీ ముందుకు వస్తున్నాము, ఈ సారి మమ్మల్ని ఆశీర్వదించి రానున్న ఐదు సంవత్సరాల పాటు మీ అందరికీ సేవను... అభివృద్ధిని అందించే అవకాశం ఇవ్వాలని సవినయంగా విజ్ఞప్తి చేస్తున్నాను.వార్డు సమస్యలు నా సమస్యలుగా భావించి నిరంతరం వార్డు అభివృద్ధికై కృషి చేస్తానని కొనియాడారు.

# చోరీ కేసు నమోదు

**రామారెడ్డి ఫిబ్రవరి 07 (ప్రజా జ్యోతి)**

రామారెడ్డి లోని ఎస్సీ కాలనీలో ఉండే పైడి చంద్రశేఖర్ కుటుంబ సభ్యులు స్థానికంగా లేకపోవడం వలన, శనివారం ఉదయం ఇంట్లో శబ్దాలు రాగా వెంటనే చుట్టుపక్కల వారు అప్రమత్తమై పరిశీలించి చూడగా దొంగతనానికి పాల్పడిన వ్యక్తి లింగాపురం రాజ్ కుమార్ (28)రామారెడ్డి గ్రామం కు చెందినవాడిగా గుర్తించడం జరిగింది.ఇట్టి విషయంపై చంద్రశేఖర్ తమ్ముడు వెంకటేశం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేయడం జరిగిందని స్థానిక ఎస్ఐ పి.రాజశేఖర్ తెలిపారు.

# రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



**నిజామాబాద్ రూరల్: ఫిబ్రవరి, 7 (ప్రజా జ్యోతి)**

శుక్రవారం రాత్రి సుమారు 8 గంటల సమయంలో నిజామాబాద్ మండలం ధర్మారం గ్రామానికి చెందిన మంత్రి శ్రీనివాస్ గౌడ్ (వయస్సు: 41 సంవత్సరాలు) అనే వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు అందించినవివరాల ప్రకారం, మృతుడు తొర్లికొండ గ్రామంలో బంధువుల ఇంట్లో నిర్వహించిన శుక్రవారం దేవి పండుగకు హాజరై తిరిగి తన గ్రామానికి బైక్‌పై వెళ్తుండగా, మునిపెల్లి గ్రామ శివారులోని ఎన్‌హెచ్--63 జాతీయ రహదారిపై ఎదురుగా వచ్చిన టాటా సుమో తరహా వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆయనకు తలతో పాటు శరీరంలోని ఇతర భాగాలకు తీవ్ర గాయాలు అయ్యాయి.స్థానికులు వెంటనే గాయపడిన వ్యక్తిని ఆర్మూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.మృతుడికి ఇద్దరు కుమార్తెలు ఉండగా, ఆయన భార్య మంత్రి సంధ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రమాదానికి కారణమైన వాహనాన్ని గుర్తించేందుకు సీసీ కెమెరా ఫుటేజీని పరిశీలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విస్తృత ప్రచారం.

**– ఆర్మూర్ అభివృద్ధి కోసం కాంగ్రెస్ ను గేల్పించండి**

**ఆర్మూర్, ఫిబ్రవరి 7 (ప్రజాజ్యోతి)**

ఆర్మూర్ పట్టణాన్ని అభివృద్ధి లోకి రావాలంటే కాంగ్రెస్ అభ్యర్థులను గెల్పించాలి బిజెపి,బీఆర్ఎస్ కి ఓటు వేసి వృధా చేసుకోవద్దని పౌరసరాపరాల,ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రజలను కోరారు. ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ చౌరస్తా వద్ద ఆర్మూర్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జి ప్రొద్దుటూరు వినయ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో కార్నర్ మీటింగ్ ను ఏర్పాటు చేశారు.కాంగ్రెస్ పార్టీ సెక్యులర్ పార్టీ అని అన్ని మతాలను గౌరవిస్తూ ముందుకు సాగుతుందన్నారు.మున్సిపాలిటీలో 36 వార్డులు గెలవడం ఖాయమని జోస్యం చెప్పారు.మైనారిటీల సంక్షేమం,అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ పాటు పడుతుందని చెప్పారు.పదేళ్ల బిఆర్ఎస్ పార్టీ పాలనలో ఒక్క రేషన్ కార్డు కూడా తెలంగాణ ప్రజలకు అందలేదన్నారు.కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక అర్హులందరికీ రేషన్ కార్డు అందుతుందని ఆయన మాట్లాడారు.ఎలక్షన్స్ తర్వాత మళ్లీ ప్రజలకు,అర్హులకు రేషన్ కార్డు అందిస్తామని వివరించారు.ఇప్పటికే 18 కోట్ల 70 లక్షలు బిటి రోడ్లు, డ్రైనేజీల పనులు వేగవంతంగా జరుగుతున్నాయని వివరించారు.ఆర్మూర్ పట్టణానికి ప్రత్యేక చొరవ తీసుకొని ఎన్ని నిధులైన కేటాయించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. మున్సిపాలిటీలోని 36 వార్డులలో కాంగ్రెస్ పార్టీ గెలిచే విధంగా ఏ బి చిన్న, వినయ్ కుమార్ రెడ్డి పనిచేయాలని కోరారు.ఈ కార్నర్ మీటింగ్ లో ఆర్మూర్ పట్టణ అధ్యక్షుడు సాయిబాబాగౌడ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు అయ్యప్ప శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు ఆసిఫ్,రాము, గంగూలీ గౌడ్, పార్టీ నాయకులు ఉన్నారు.




# భీమ్గల్ మున్సిపల్ ను మార్పు చేద్దాం ఓటు మీరు వెయ్యండి

**బాల్కొండ ఆర్ సి ప్రజా జ్యోతి ఫిబ్రవరి 7**

నిజామాబాద్ జిల్లాభీంగల్ మున్సిపాలిటీ పరిధిలోని 10 వ వార్డ్ నుంచి కాంగ్రెస్ పార్టీ చైతు గుర్తు పార్టీ తరఫున జై జై లతా నర్సయ్య కౌన్సిలర్‌గా పోటీ చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భీంగల్ మున్సిపాలిటీ తెలంగాణ రాష్ట్రంలోనే ఉత్తమ మున్సిపల్ గా పేరు తెస్తానని బడుగు బలహీన వర్గాలకు న్యాయం చేకూరుస్తానని భీంగల్ పట్టణానికి కోర్టు తీసుకొని వచ్చే క్రమంలో ముందున్నానని అభివృద్ధిలో సిసి రోడ్లు డ్రైనేజీ వాటర్ సమస్యకు కాంగ్రెస్ పార్టీ నుంచి నిధులు తీసుకొని వచ్చానని ఆరవ వార్డులో ఉన్న సమస్యలను తక్షణమే పరిష్కరిస్తానని నన్ను ప్రజలందరూ ఆశీర్వదించి కౌన్సిలర్ గా ప్రజలు ఓటు వేసి తనను గెలిపిస్తే వార్డులో ఉన్న ప్రతి సమస్యను గుర్తించి దశలవారీగా అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు.

10 వ వార్డ్‌లో నెలకొన్న తాగునీటి కొరత, డ్రైనేజీ సమస్యలు, సీసీ రోడ్లు, వీధి దీపాలు, పారిశుద్ధ్యం వంటి మౌలిక వసతుల లోపాలను పరిష్కరించడమే తన ప్రధాన లక్ష్యమని తెలిపారు. అలాగే పేద, మధ్యతరగతి ప్రజల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి మున్సిపాలిటీ ద్వారా నిధులు తీసుకువచ్చి అభివృద్ధి పనులు చేపడతానన్నారు. జై జై లతా నర్సయ్యకాంగ్రెస్ పార్టీ చైతు గుర్తు పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా ప్రజలకు అందుబాటులో ఉండే కౌన్సిలర్‌గా పని



చేస్తానని, వార్డు అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తానని పేర్కొన్నారు. జేజే లతా నరసయ్య ఈ ఎన్నికల్లో తనకు ఓటు వేసి కాంగ్రెస్ పార్టీ చేతు గుర్తు పార్టీని గెలిపించాలని ఆయన వార్డు ప్రజలను కోరారు.

# కాంగ్రెస్ అబద్ధాలను ఎండగడుతున్నందుకే నాపై దండయాత్ర.

**నిజామాబాద్ జిల్లా భీంగల్ మండలంలో మున్సిపల్ లో జరుగుతున్న ఎన్నికల్లో ఎన్ని కేసులు పెట్టినా భయపడేది లేదు**

**భీమ్‌గల్ అభివృద్ధిపై ఉత్తమ్ కుమార్ రెడ్డి వ్యాఖ్యలు హాస్యాస్పదం**

**తులం బంగారం అడిగినందుకు లాఠీలతో కొట్టించి, మాపైనే కేసులు పెడతారా**

**అధికార గర్వంతో దౌర్జన్యాలకు దిగుతున్న కాంగ్రెస్ నాయకులు**

**మాజీ మంత్రి,ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి**

**బాల్కొండ ఆర్ సి ప్రజా జ్యోతి ఫిబ్రవరి 7**

భీమ్‌గల్ మున్సిపాలిటీ ఎన్నికల ప్రచారంలో భాగంగా 6వ వార్డు లో నిర్వహించిన కార్నర్ మీటింగ్ సభలో మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి గారు పాల్గొని కాంగ్రెస్ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. గత నాలుగైదు రోజులుగా భీమ్‌గల్‌లో తిరుగుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏయే పనులను ఆపివేసిందో, ప్రజలను ఎలా మోసం చేసిందో నేను వివరిస్తున్నాను. నేను చెబుతున్న నిజాలకు ప్రజల నుండి వస్తున్న స్పందన చూసి, ఎక్కడ ఓడిపోతామో అన్న భయంతో కాంగ్రెస్ నాయకులు నాపై మాటల దాడులకు తెగబడుతున్నారు. హైదరాబాద్ నుండి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని పిలిపించి భీమ్‌గల్‌లో ప్రెస్ మీట్ పెట్టించారు. ప్రశాంత్ రెడ్డి భీమ్‌గల్‌కు ఏమీ చేయలేదని ఆయనతో అబద్ధాలు చెప్పించారు. పక్కనే ఉన్న స్థానిక కాంగ్రెస్ నాయకులు ఆయన చెవిలో ఊదితే, ఒక బాధ్యతాయుతమైన మంత్రి అయి ఉండి వాస్తవాలు తెలుసుకోకుండా మాట్లాడటం సిగ్గుచేటు.బాల్కొండ నియోజకవర్గ ఇంచార్జ్ సునీల్ రెడ్డి,కార్పొరేషన్ చైర్మన్ లు అనిల్, మానాల మోహన్ రెడ్డి లాంటి నాయకులు ప్రభుత్వ కార్లు, పోలీసు జీపులు వేసుకొని నాపై దండయాత్రకు వస్తున్నారు. నేను నిజాలు చెబుతుంటే నన్ను అడ్డుకోవడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. మీరు ఎన్ని అడ్డంకులు సృష్టించినా, ప్రజల కోసం వాస్తవాలను వెల్లడిస్తూనే ఉంటాను.మొన్న మంత్రి జూపల్లి కృష్ణారావు భీమ్‌గల్ వచ్చినప్పుడు.. మీరు ఎన్నికల్లో హామీ ఇచ్చిన తులం బంగారం ఏది అని ప్రశ్నించినందుకు మమ్మల్ని పోలీసులతో దారుణంగా కొట్టించారు. లాఠీలతో దాడి చేయించడమే కాకుండా, తిరిగి మాపైనే (32 మందిపై) అక్రమ కేసులు పెట్టారు. ఎన్నికల్లో మాట్లాడకూడదని బైండోవర్లు చేస్తున్నారు. దేవుడి సాక్షిగా చెబుతున్నాను, నేను చెప్పే ప్రతి మాట అక్షర సత్యం. ఈ దౌర్జన్యాలను ప్రజలు గమనించాలని ఎమ్మెల్యే కోరారు.



# గాడ్కోల్ శ్రీ లక్ష్మి గ్రామ సంఘం సమావేశం



**నిజామాబాద్ రూరల్: ఫిబ్రవరి, 7 (ప్రజా జ్యోతి)**

సిరికొండ మండలంలోని గాడ్కోల్ గ్రామంలో శ్రీ లక్ష్మి గ్రామ సంఘం సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశంలో సంఘ సభ్యులకు సంబంధించిన వివిధ అంశాలపై సీసీ వనిత మేడం మరియు సిరికొండ మండల ఏపీఎం సువర్ణ మేడంలు విపులంగా వివరించారు.

గ్రామ సంఘంలో సభ్యులుగా ఉండటం వల్ల కలిగే లాభాలు, ప్రభుత్వ పథకాల ద్వారా అందుబాటులో ఉన్న అవకాశాలు, సంఘ కార్యకలాపాల నిర్వహణ విధానాలపై సభ్యులకు స్పష్టత కల్పించారు. సంఘం బలోపేతం కోసం ప్రతి సభ్యుడు చురుకుగా పాల్గొనాలని వారు సూచించారు.

అనంతరం గ్రామ సంఘం తరఫున గ్రామ సర్పంచ్ లత శంకర్, ఉప సర్పంచ్ సంపత్ రెడ్డి గార్లను శాలువాలతో సన్మానించారు. గ్రామ అభివృద్ధికి వారు అందిస్తున్న సేవలను ఈ సందర్భంగా ప్రశంసించారు.

ఈ కార్యక్రమంలో వీఓఏ స్వామి, గ్రామ సంఘం అధ్యక్షురాలు స్వప్న , సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# హుస్సేన్‌నగర్‌లో ఉపాధి హామీ పథకం ద్వారా ప్రేయర్ చార్జింగ్ పంపుల పంపిణీ



సిరికొండ మండలం హుస్సేన్‌నగర్ గ్రామంలో గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా సబ్సిడీపై అందించిన ప్రేయర్ చార్జింగ్ పంపులను గ్రామ సర్పంచ్ మల్లేష్ యాదవ్, ఉప సర్పంచ్ రావుట్ల రమేష్ వారి ఆధ్వర్యంలో ఆరుగురు లబ్ధిదారులకు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా గ్రామ ప్రజలు ఉపాధి హామీ పథకం ద్వారా అందుతున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ పంపుల ద్వారా రైతులు మరియు గ్రామస్తులకు విద్యుత్ వినియోగంలో ఆదా కలిగి, సాగునీటి అవసరాలు సులభంగా తీర్చుకోగలరని తెలిపారు.గ్రామ అభివృద్ధికి ప్రభుత్వ పథకాలు సమర్థవంతంగా అమలవుతున్నాయని, ప్రతి అర్హుడైన లబ్ధిదారుడు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని

# రోడ్డు ప్రమాదంలో విద్యార్థిని దుర్మరణం.

**కామారెడ్డి సమీపంలో రోడ్డు ప్రమాదం.**

**కుటుంబంలో విషాదఛాయలు.**



బోధన్ ఫిబ్రవరి 07 (ప్రజాజ్యోతి) బోధన్ మండలం కోపర్గా గ్రామానికి చెందిన లక్ష్మి (13) అనే బాలిక రోడ్డు ప్రమాదంలో మృతిచెందింది. రెంజల్ మండలంలోని బీసీ బాలికల వసతి గృహంలో ఉంటూ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న లక్ష్మి, నవోదయ విద్యాలయ ప్రవేశ పరీక్ష రాసేందుకు తన తండ్రితో కలిసి వెళ్లింది. పరీక్ష పూర్తయిన అనంతరం స్వగ్రామానికి తిరుగు ప్రయాణంలో ఉండగా, కామారెడ్డి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో లక్ష్మి తీవ్రంగా గాయపడింది. ప్రమాదం జరిగిన వెంటనే ఆమెను ఆసుపత్రికి తరలించేందుకు ప్రయత్నించినప్పటికీ, అప్పటికే లక్ష్మి అక్కడికక్కడే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ ప్రమాదంలో బాలిక తండ్రికి స్వల్ప గాయాలు కాగా, చికిత్స పొందుతున్నట్లు సమాచారం. కుమార్తె మృతితో వారి కుటుంబంలో తీవ్ర విషాదం అలుముకుంది. నవోదయ విద్యాలయంలో చేరాలనే ఆశతో పరీక్ష రాసిన బాలిక అకాల మృతిచెందడం స్థానికంగా తీవ్ర విషాదాన్ని మిగిల్చింది.గ్రామస్థులు, పాఠశాల ఉపాధ్యాయులు, సహచర విద్యార్థులు లక్ష్మి మృతిపై దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ, ఆమె కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# అధికారుల వేధింపులే కారణమా..?

**బిల్ కలెక్టర్ ఆత్మహత్య ఘటనపై ఆరోపణలు.**
**పెంట ఖుర్దు గ్రామంలో కలకలం.**

**బోధన్ ఫిబ్రవరి 07 (ప్రజాజ్యోతి)**
నిజామాబాద్ జిల్లా బోధన్ మండలం పెంట ఖుర్దు గ్రామ పంచాయతీలో బిల్ కలెక్టర్‌గా పనిచేస్తున్న గైని బాబు (45) ఆత్మహత్య ఘటన తీవ్ర కలకలం రేపుతోంది. అధికారుల వేధింపులతో పాటు, నిధుల దుర్వినియోగం ఆరోపణలను తనపై నెట్టినందుకే బాబు బలవన్మరణానికి పాల్పడ్డారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రెండు రోజుల క్రితం బాబు పురుగుల మందు సేవించగా, కుటుంబ సభ్యులు వెంటనే ఆయనను నిజామాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం అర్ధరాత్రి ఆయన మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. బాబు మరణంతో ఆయన కుటుంబం దిక్కుతోచని పరిస్థితిలో పడింది. మృతుడికి ముగ్గురు సంతానం ఉండగా, అందులో ఇద్దరు ఆడపిల్లలు వికలాంగులు కావడం ఆ కుటుంబాన్ని మరింత విషాదంలో ముంచెత్తింది. కుటుంబానికి ఆధారమైన బాబు మృతితో భార్య, పిల్లల భవితవ్యం ప్రశ్నార్థకంగా మారింది. గ్రామ పంచాయతీలో విధులు నిర్వహిస్తున్న సమయంలోనే బాబుపై అనవసర ఒత్తిడులు, వేధింపులు చోటుచేసుకున్నాయని కుటుంబ సభ్యులు, గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఈ ఘటనపై



న్యాయమైన విచారణ చేపట్టి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఈ ఘటన బోధన్ మండలంలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

# విద్యుత్ ప్రమాదంలో మృతి చెందిన రైతు కుటుంబానికి రూ.5 లక్షల చెక్కు అందజేత

**నిజామాబాద్ రూరల్: ఫిబ్రవరి 7 (ప్రజా జ్యోతి)**
నిజామాబాద్ నగరంలోని గుప్పన్‌పల్లి బైపాస్ రోడ్డులో ఉన్న రూరల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం రూరల్ ఎమ్మెల్యే డా. రేకులపల్లి భూపతిరెడ్డి విద్యుత్ ప్రమాదంలో మృతి చెందిన రైతు కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేశారు.సిరికొండ మండలం దుప్య తండాకు చెందిన మాలవత్ రమేష్ గత 10 నెలల క్రితం తన పొలంలో వ్యవసాయ పనులు చేస్తుండగా విద్యుత్ షాక్ తగిలి మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే డా. భూపతిరెడ్డి జిల్లా విద్యుత్ శాఖ ద్వారా మృతుడి భార్య మాలవత్ నీలాకు రూ.5 లక్షల పరిహార చెక్కును క్యాంపు కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డా. భూపతిరెడ్డి మాట్లాడుతూ, బాధిత కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలుస్తుందని తెలిపారు. ఇలాంటి దుర్ఘటనలు పునరావృతం కాకుండా రైతులు మరియు ప్రజలు విద్యుత్ భద్రతపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ యువ నాయకులు ఉమ్మాజీ నరేష్, దుప్య తండా సర్పంచ్, మండల సర్పంచ్



ఫోరం అధ్యక్షుడు చందర్ నాయక్తో పాటు కాంగ్రెస్ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## నిజామాబాద్ కమిషనరేట్ పరిధిలో వారం రోజుల్లో
# 97 డ్రంకన్ డ్రైవ్ కేసులు నమోదు

**రూ.9.40 లక్షల జరిమానా విధింపు**
**: పోలీస్ కమిషనర్ వెల్లడి**

**నిజామాబాద్ రూరల్: ఫిబ్రవరి, 7 (ప్రజా జ్యోతి)**
నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో గడిచిన వారం రోజులలో డ్రంకన్ డ్రైవ్‌పై ప్రత్యేక తనిఖీలు నిర్వహించి 97 కేసులు నమోదు చేసినట్లు పోలీస్ కమిషనర్ శ్రీ పి. సాయి చైతన్య, ఐ.పి.ఎస్. వెల్లడించారు. సంబంధిత కోర్టులు ఈ కేసులకు గాను రూ.9,40,000 జరిమానా విధించినట్లు తెలిపారు.

నిజామాబాద్ కమిషనరేట్ పరిధిలోని నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్లు మరియు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ల పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్ సరిహద్దుల్లో వాహనాల తనిఖీలు చేపట్టినట్లు చెప్పారు. ఈ క్రమంలో తేదీ 02-02-2026 నుండి 06-02-2026 వరకు నిర్వహించిన తనిఖీల్లో మద్యం సేవించి వాహనాలు నడిపిన వారిపై చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. నమోదైన 97 మంది నిందితులను సంబంధిత కోర్టులలో హాజరుపరచగా, కోర్టులు వారికి మొత్తం రూ.9.40 లక్షల జరిమానా విధించడమే కాకుండా, ముగ్గురికి వారం రోజుల జైలు శిక్ష కూడా విధించినట్లు పోలీస్ కమిషనర్ పేర్కొన్నారు.

ప్రజల ప్రాణ రక్షణే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని, మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు ఈ తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని తెలిపారు.

గమనిక:
ప్రజలు మద్యం సేవించి వాహనాలు నడపరాదు.
వాహనదారులు తమ వాహనాలకు సంబంధించిన అన్ని పత్రాలను సక్రమంగా తమ వద్ద ఉంచుకోవాలి.




# ఎన్నికల ఏర్పాట్లను పరిశీలించిన అడిషనల్ కలెక్టర్.

**స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్, డిస్ట్రిబ్యూషన్ హాళ్లను తనిఖీ చేసిన అధికారులు**



బోధన్ ఫిబ్రవరి 07 (ప్రజాజ్యోతి)

నిజామాబాద్ జిల్లా బోధన్ పట్టణంలోని విజయ మేరీ పాఠశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ హాల్, డిస్ట్రిబ్యూషన్ హాల్‌లను శనివారం ఎన్నికల అధికారులు పరిశీలించారు. ఎన్నికల నిర్వహణకు చేపట్టిన ఏర్పాట్లను క్షుణ్ణంగా పరిశీలించిన అడిషనల్ కలెక్టర్ అంకిత్, సిబ్బందికి పలు కీలక సూచనలు, సలహాలు ఇచ్చారు. ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు నిబంధనల ప్రకారం ఉండాలని ఆయన ఆదేశించారు. భద్రత, లాజిస్టిక్స్, సిబ్బంది సమన్వయంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈ పరిశీలనలో అడిషనల్ కలెక్టర్ అంకిత్‌తో పాటు బోధన్ సబ్ కలెక్టర్, బోధన్ మున్సిపల్ కమిషనర్ పాల్గొన్నారు. అధికారులు ఎన్నికల నిర్వహణకు సంబంధించి చేపట్టాల్సిన ముందస్తు చర్యలపై సమీక్ష నిర్వహించారు.

# దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి.

**ఎడపల్లిలో సంయుక్త కిసాన్ మోర్చా సమావేశంలో నాయకుల పిలుపు**

**బోధన్ ఫిబ్రవరి 07 (ప్రజాజ్యోతి)**
ఎడపల్లి మండల కేంద్రంలోని అఖిల భారత ఐక్య రైతు సంఘం కార్యాలయంలో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సంయుక్త కిసాన్ మోర్చా (ాఖవీ) బోధన్ డివిజన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర కమిటీ సభ్యులు గుమ్ముల గంగాధర్, పుట్టి నడిపి నాగన్నలు పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, 2014లో అధికారంలోకి వచ్చిన మోడీ సర్కార్ కార్పొరేట్ వ్యాపారులకు వత్తాసు పలుకుతూ లాభాలు చేకూరుస్తోందని విమర్శించారు. కార్మికులు, రైతులు, కూలీలకు వ్యతిరేకంగా విధానాలను అమలు చేస్తూ ప్రజావర్గాలను దెబ్బతీస్తోందని ఆరోపించారు. బ్రిటిష్ పాలనలో పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను, మే డే స్ఫూర్తితో సాధించుకున్న ఎనిమిది గంటల పని దినాన్ని రద్దు చేస్తూ నాలుగు లేబర్ కోడ్లను తీసుకురావడం ద్వారా కార్మిక వర్గానికి తీవ్ర ద్రోహం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. దేశానికి, ప్రపంచానికి అన్నం పెడుతున్న రైతాంగం సాధించుకున్న సబ్సిడీలను తగ్గించడం, కనీస మద్దతు ధర (మీప్రా)కు చట్టబద్ధత కల్పించకుండా అడ్డుకోవడం మాత్రమే కాకుండా, వ్యవసాయ రంగాన్ని మొత్తం కార్పొరేట్లకు దారదత్తం చేయాలనే ఉద్దేశంతో నూతన విద్యుత్ చట్టం, నూతన విత్తన చట్టాలను రూపొందించి అమలు చేయాలని ప్రయత్నించడం రైతు వ్యతిరేక విధానాలకు అద్దం పడుతుందని అన్నారు. అలాగే పోరాటాల ద్వారా సాధించుకున్న ఉపాధి హామీ చట్టానికి తిలోదకాలు ఇస్తున్నారని విమర్శించారు. బీడీ కార్మికులకు రోజురోజుకు పని దినాలు తగ్గిపోతున్నాయని, రైతు కార్మిక వ్యతిరేక చట్టాల వల్ల జీవనోపాధి ప్రశ్నార్థకంగా మారుతోందని తెలిపారు. ఈ పరిస్థితులను నిరసిస్తూ ఫిబ్రవరి 12వ తేదీన జరగనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను పాలకవర్గ సంఘాలు, వామపక్ష సంఘాలు, రైతు, కార్మిక, విద్యార్థి, యువజన సంఘాలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంయుక్త కిసాన్ మోర్చా బోధన్ డివిజన్ నాయకులు కాషా రవి, సుల్తాన్ సాయిలు, శ్రీపతి మల్లేష్, పి. గోపాల్, వడ్డెట్టి రాజుతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

